**వనం నాగయ్య, కెరటం న్యూస్ ప్రతినిధి**

కామ్రేడ్ పల్లా జాన్‌రాములు.. ఈపేరు తెలియని వారు దాదాపు చాలా తక్కువనే చెప్పాలి.. ఎందుకంటే కమ్యూనిస్టుపార్టీ నాయకునిగా పేద ప్రజల కష్టాలను కండ్లారా చూసి వారికి కూడు, గూడు, గుడ్డ దక్కాలని అహర్నిశలు కష్టపడిన నాయకుడు. తన జీవితాంతం పేదల సంక్షేమం కోసం పనిచేసి తనకు పేదల్లో ఎన్నటికీ చెరిగిపోని గూడు కట్టుకున్నారు. ఆయన మరణించి కొన్నేళ్లు గడుస్తున్నా ఎక్కడో ఒక చోట ఆయన పేరుతో సమావేశాలు, సంస్మరణ సభలు నిర్వహించుకోవడంతో ప్రజలు ఆయన్ను మరిచిపోలేదని చెప్పకనే చెపుతున్నది. తాజాగా ఆయన తనయుడు పల్లా రాజశేఖర్ సారధ్యంలో శుక్రవారం ఖమ్మంలోని సీక్వెల్ రిసార్ట్స్‌లో జరిగిన మాల, మాల ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం దిగ్విజయం కావడం, అందుకు నెల రోజుల నుండి మాల సామాజిక ఉద్యోగులు, వైద్యులు, ఉద్యమకారులు, జర్నలిస్టులను, న్యాయవాదులను, కళాకారులు, వివిధ వర్గాల ప్రజలను ఐక్యం చెయ్యడంతో పాటు వారందరినీ సమావేశానికి వచ్చేలా చేసి ఇద్దరు ఎమ్మెల్యేలు( వివేక్, నాగరాజు) సమక్షంలో కనీవినీ ఎరుగని రీతిలో మాలలను ఐక్యం చేసిన పల్లా జాన్‌రాములు తనయుడు పల్లా రాజశేఖర్ తండ్రికి తగ్గ తనయుడని సమావేశంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరూ చర్చించుకోవడం గమనార్హం. వాస్తవానికి ఖమ్మం నగరంలో ఎంతో మందికి ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత పల్లా జాన్‌రాములుకే దక్కింది.




# తండ్రికి తగ్గ తనయుడు

## పల్లా రాజశేఖర్




కామ్రేడ్ పల్లా జాన్‌రాములు చర్చి కాంపౌండ్ ప్రాంతంలో తన ప్రస్థానాన్ని ప్రారంభించి జిల్లాలో అనేక మందికి పేదలకు తనవంతుగా సాయం చేశారు. మార్క్సిస్టు పార్టీ నేతగా తుది శ్వాస విడిచేంత వరకూ పార్టీ నియమాలకు కట్టుబడి తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఖమ్మం నగరంలో వందలాది మందికి సొంతిల్లు లేని నిరుపేదలను చేరదీసి వారికి సొంతింటి కలను నిజం చేసేలా ఆనాడు ప్రభుత్వాలపై ఉద్యమాలు చేసి పేదలకు దక్కాల్సిన సంక్షేమాన్ని సాధించి చూపించారు. అందుకే ఆయన పేరు ఈ రోజుకు కూడా పేద ప్రజల మనసుల్లో పదిలంగా ఉంది. కాగా ఆయన తనయుడు పల్లా రాజశేఖర్ తన జాతి కోసం చిన్న నాటి నుండే తన తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ తన తండ్రి ఆశయాలను నిలబెట్టేందుకు గాను ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రధానంగా మా, మాల సామాజిక సంఘాలకు, న్యాయ వాదులకు, జర్నలిస్టులకు, పేదలకు ఇలా అన్ని వర్గాల ప్రజలకు తన వంతుగా సాయం చేస్తూ ముందుకు కదులుతున్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా కార్యక్రమాలకు హాజరై అందరినీ అక్కున చేర్చుకుం టున్నారు.

### వేల గొంతులను ఐక్యం చేసిన రాజశేఖర్...

మాల మహానాడు జాతీయ, రాష్ట్ర నాయకులు 2024 డిసెంబర్ 01న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు ప్రతీ జిల్లా నుండి వేలాదిగా కార్యకర్తలు తరలిరావాలని ఇచ్చిన పిలుపులో భాగంగా దాదాపు నెల రోజుల నుండి మాల సామాజిక బాధ్యులను, మాల ఉద్యోగులు, న్యాయవాదులు, జర్నలిస్టులను, కార్యకర్తలను ఐక్యం చేయడంలో విజయవంతం అయ్యారనే చర్చ జరుగుతోంది. అంచనాలకు మించి ఖమ్మం నగరంలో జరిగిన మాలల సమా వేశానికి కార్యకర్తలు, ప్రతినిధులు తరలి రావడం గమనార్హం. ఘనంగా మాలల ఆత్మీయ సమ్మేళనం విజయ వంతం కావడం వెనుక రాజశేఖర్ పాత్ర చాలా ఉందనే చెప్పాలి. డిసెంబర్ 1న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ, ఎస్సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మరియు మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం సభలో ఎమ్మెల్యేలు వివేక్ వెంకట స్వామి, కేఆర్‌నాగరాజు పిలుపు నిచ్చారు. తొలుత నయా బజార్ కాలేజీ నుండి పాత బస్టాండ్, జడ్పీ సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా మమతా రోడ్డులో గల ఈ ఆర్ ఆర్ ఓయాసిస్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీగా తరలివచ్చారు. ఎస్సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యేలు వివేక్ వెంకట స్వామి, వర్ధన్నపేట ఎమ్మెల్యే మరియు తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషయిన్ అఫ్ మాల టీం రాష్ట్ర అధ్యక్షులు కే ఆర్ నాగరాజు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జీ చెన్నయ్య లు హాజరైనరు. ఈ సభకు అధ్యక్షులుగా పల్లా రాజశేఖర్ అడ్వకేట్, కన్వీనర్ గుంతేటి వీరభద్రం వహించారు. దీనిలో మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ డి సర్వయ్య, సమతా సైనిక్ దళ్ దేశ ఉపాధ్యక్షులు దిగంబర్ కాంబ్లే, టీం రాష్ట్ర కార్యదర్శి మేకల రవీందర్, డాక్టర్ గోపీనాథ్, భీమ్ ఫౌండేషన్ అధ్యక్షులు మందాల భాస్కర్, ప్రముఖ గాయకులు రెంజర్ల రాజేష్, పిల్లి బాలరాజు, తలమల హుస్సేన్, ఉద్యోగుల సంఘం నాయకులు, జంగం లక్ష్మణరావు, ముత్తమాల ప్రసాదు కార్యక్రమ నిర్వాహకులుగా వ్యవహ రించినారు. ప్రముఖ గైనకాలజిస్టు డా. స్వర్ణ కుమారి, అధ్యాపకురాలు విజయలక్ష్మి, డాక్టర్ బాబు రత్నాకర్ ప్రసంగించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూల నుండి పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు నాయకులు హాజరైనారు. వీరితో పాటు వివిధ ప్రాంతాల నుండి మాల మహానాడు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరైనారు. ఈ విజయంలో గుంతేటి వీరభద్రం, ముత్తమాల ప్రసాద్, జంగం లక్ష్మణరావు, న్యాయవాదులు, జర్నలిస్టులు ఐక్యంగా అవగాహన కల్పించి పల్లా రాజశేఖర్ సారథ్యంలో ఘనంగా నిర్వహిం చుకున్నారు. కళాకారులు పాగి వెంకన్న తదితరులు ఆడిపాడి ఆకట్టుకున్నారు.